'జగద్గిరిగుట్ట - మేడారం' ప్రత్యేక బస్సులు

జగద్గిరిగుట్ట: మేడారం సమ్మక్క సారాలమ్మ జాతరను పురస్కరించుకొని జగద్గిరిగుట్ట నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు కూకట్‌పల్లి డీఎం ఇసాక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 19 బస్సులు, జాతర ముగిసే వరకు భక్తులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మేడారానికి వెళ్లే భక్తులు బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా అమృతాలయ వార్షికోత్సవం

జగద్గిరిగుట్ట: గణేష్‌నగర్ అమృతాలయ 9వ వార్షికోత్సవం వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, మహాలక్ష్మి, భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి, అభయాంజనేయ స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అన్నదాన కార్యక్రమంతో ఉత్సవాలు పూర్తవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

రిజర్వాయర్ పైకప్పు నిర్మాణానికి నిధులు మంజూరు



షాపూర్‌నగర్ రిజర్వాయర్‌లోని పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న జీఎం శ్రీధర్‌రెడ్డి

చింతల్: షాపూర్‌నగర్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో ఉన్న జీఎల్ఎస్ఆర్ రిజర్వాయర్ పైకప్పు పునర్నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు కుత్బుల్లాపూర్ వాటర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన షాపూర్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలో పలు బస్తీలు, కాలనీలలో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం సబ్ డివిజన్ షాపూర్ నగర్ కార్యాలయానికి వచ్చిన శ్రీధర్‌రెడ్డి రిజర్వాయర్ పరిసరాల ప్రాంతాలను పరిశీలించి శిథిలావస్థకు చేరిన రిజర్వాయర్ పైకప్పుకు జలమండలి ప్రధాన కార్యాలయం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పైకప్పు నిర్మాణం కోసం టెండర్ దశలో ఉందని త్వరలోనే రెండు పనులు పూర్తి చేస్తామన్నారు. రానున్న వర్షాకాలానికి ఇబ్బందులు తలెత్తకూడదని ఉద్దేశంతో త్వరితగతిన చేశామన్నారు. ఆయన వెంట డీజీఎం అప్పలనాయుడు, సెక్షన్ల మేనేజర్లు రోహిణి రమ్య, భారతి, అనూష, సిబ్బంది ఉన్నారు.

అందుబాటులో ఉంటా.. సమస్యలను పరిష్కరిస్తా



శివ పడిపూజ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. సోమవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు రాజును మర్యాదపర్వకంగా కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

◆ గాజులరామారం నల్లగుట్ట భ్రమరాంబ మల్లికార్జున దేవస్థానం ఆవరణలో ఈనెల 24వ తేదీన జరుగనున్న ద్వాదశ జ్యోతిర్లింగ శివ పడిపూజ మహోత్సవ పోస్టర్‌ను ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సోమవారం శంభీపూర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్ నిర్లక్ష్యం

ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు



యాదగిరి మృతదేహం



ప్రమాదానికి కారణమైన కారు

జగద్గిరిగుట్ట: క్యాబ్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ క్రాంతి కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.గాజులరామారం, ప్రకాశం పంతులు నగర్‌కు చెందిన యాదగిరి (56) కుటుంబ సభ్యులతో కలిసి కొత్తగూడెంలో బంధువుల వివాహానికి వెళ్లారు. సోమవారం ఉదయం రైల్వేస్టేషన్ నుంచి ఇంటికి తిరిగి వచ్చేందుకు ఊబర్ క్యాబ్ బుక్ చేసుకున్నారు. అతివేగం కారణంగా ఉషా ముళ్లపూడి హాస్పిటల్ వద్ద కారు అదుపుతప్పి చెట్టును, ఆపై స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో యాదగిరి అక్కడికక్కడే మృతి చెందగా, అతని కోడలు పూజ కాళ్లు విరిగాయి.అతడి భార్య ఉమ, కుమారుడు హేమంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో చింతల్ లోని రామ్‌రాజ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. యాదగిరి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

సుభాష్‌నగర్: ప్రధాన రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న దుకాణాలను ఇటీవల వరుసగా జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా తొలగిస్తున్న నేపథ్యంలో తిరుమల ట్రాఫిక్ పీఎస్‌కు కూతబెట్టి దూరంలోనే ఓ వ్యక్తి దర్జాగా షాపును ఏర్పాటు చేశారు. సూరారం ప్రధాన రోడ్డు అంబేడ్కర్ భవన్ ముందు ఓ వ్యక్తి ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన షెడ్డును తొలగించాలని దళిత సంఘం నేత యాదగిరి డిమాండ్ చేశారు. పాదచారులు నడవడానికి ఇబ్బందిగా ఉన్న ఇలాంటి షెడ్డును తక్షణమే తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



సూరారం అంబేడ్కర్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన షెడ్డు..

గాడిద పాలు ఔషధ గుణాలు మెండు



జగద్గిరిగుట్ట చాకలి ఐలమ్మ చౌరస్తాలో గాడిదలతో చంద్రమ్మ కుటుంబ సభ్యులు



గాడిద పాలు పిండుతున్న చంద్రమ్మ

రంగారెడ్డినగర్: 'గంగిగోవు పాలు గరిటెడైనను చాలు.. కడివెడైననేమి ఖరము పాలు'మంచి ఆవు పాలు కొన్ని ఉన్నా చాలు గాడిద పాలు ఎన్ని ఉన్నా ఆవు పాలకు సమానం కావు అనేది దీనర్థం. ఇదొకప్పటి మాట. కాని నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. గాడిద పాలలో వివిధ ఔషధ గుణాలు ఉన్నాయని, ఇవి చాలా ప్రయోజనకరమైనవని నిపుణులు పేర్కొంటున్నారు. మీకు తెలుసా? హిపోక్రేట్స్‌ను దాదాపు ప్రతి అనారోగ్యానికి దీనిని సిఫార్సు చేస్తారు. ఇందులో విటమిన్‌లు ఎ, బి1, బి2, బి6, సి, డి, ఇ, ప్రొటీన్లు, కాల్షియం, యాంటీఅలెర్జెన్‌లు, యాంటీ బాక్టీరియల్ ఎంజైమ్‌లు, ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్‌లతో పాటుగా కొవ్వు తక్కువగా ఉంటుంది, లాక్టోస్ సమృద్ధిగా ఉంటుంది. దీంతో నేడు గాడిద పాలకు ఎంతో డిమాండ్ పెరిగింది.. కోవిడ్ మహమ్మారి సమయంలో చాలా మందికి గాడిద పాలు తాగాల్సిందిగా వైద్య నిపుణులు సిఫార్స్ చేశారంటే ఈ పాలు ఎంత బలవర్ధకమో అర్థం చేసుకోవచ్చు.

◆ గాడిద పాలు శరీర సౌందర్యానికి, టైప్-2 డయాబెటీస్ నిరోధక ఆవు పాలు శ్రేష్టమైనవని నిపుణులు చెబుతున్నారు. ఇందులో లభించే టయరిన్ అనే న్యూట్రిన్ శరీర పెరుగుదలకు ఎంతో దోహద పడుతుంది. ఆవు పాలతో పోలిస్తే గాడిద పాలతో చిన్నారుల్లో అలర్జీలు దరి చేరవు. దీంతో నేడు వైద్య నిపుణులు గాడిద పాలను తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఒకప్పుడు ఊళ్లల్లో గుంపులుగా కనిపించే గాడిదలు నేడు దాదాపు కనుమరుగయ్యాయి. మారుమూళ్ల ఊళ్లల్లో కొన్ని కుటుంబాలు వీటిని పెంచుతూ జీవనాధారం పొందుతున్నారు. నగరంలో అయితే గాడిదలు దాదాపు కనిపించవనే చెప్పవచ్చు.

ఆ కుటుంబానికి గాడిద పాల వ్యాపారమే జీవనాధారం..

◆ గాజులరామారం మెట్‌కానిగూడలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయం సమీపంలో నివాసముండే చంద్రమ్మ కుటుంబం గాడిదలను పెంచుతూ వాటి పాల విక్రయాల ద్వారా వచ్చే డబ్బులతో గత ఎన్నో సంవత్సరాలుగా జీవనాధారం పెంపొందుతున్నారు. ఆదివారం వచ్చిందంటే చాలు చంద్రమ్మ కుటుంబ సభ్యులు నలుగురు కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, జగద్గిరిగుట్ట, సుచిత్ర, నిజాంపేట్, ప్రగతినగర్, బాచుపల్లి పరిసర ప్రాంతాల్లో ఇంటింటికి తిరుగుతూ గాడిద పాలు విక్రయాలు చేపడుతూ వస్తున్నారు.

◆ ఉదయం 7 గంటలకు మొదలుకుని మధ్యాహ్నం వరకు పలు గల్లీలో తిరుగుతూ అవసరమైన వారికి గాడిద పాలును అప్పటికప్పుడే పిండి ఇస్తుంటారు. చిన్న బాటిల్(50 ఎంఎల్) గాడిద పాలుకు రూ.100 వరకు తీసుకుంటున్నారు. నుస్తి చేసి నిరసంగా ఉన్న చిన్న పిల్లలకు వయస్సును బట్టి 1 నుంచి 2 చిన్న సీసాలు, పెద్దలకు అయితే నాలుగైదు సీసాలు పాలు ఇస్తుంటారు.

మంచి గిరాకీ ఉంది..



గాడిద పాల కోసం చాలా మంది నుంచి ఫోన్లు వస్తుంటాయి. ఈ పాలు తాగితే చిన్న పిల్లల్లో నిమ్ము, కోరింత దగ్గు, ఆస్తమా వంటివి నయమవుతాయి. ఎముకలు గట్టి పడతాయి. పెద్దోళ్లు తాగితే దమ్ము రావడం, ఆసయం వంటివి తగ్గుతాయి. గుండెకు చాలా బలం, చిన్న పిల్లలకు గాడిద పాలు తాగిస్తే బక్కగా ఉన్న వాళ్లు ఆరోగ్యంగా తయారవుతారు. ఒక్కో గాడిద రోజుకు లీటర్ పాలు ఇస్తుంది. ఆదివారం ఒక్క రోజుకు వంద మందికి విక్రయిస్తుంటాం. ఎవరైనా ఫోన్ (9966538117) ఇంటికొచ్చి గాడిద పాలు అందిస్తాం.

– చంద్రమ్మ, మెట్‌కానిగూడ

మహదేవపురంలో జరిగిన శివాజీ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



జై భవానీ.. జై శివాజీ

ఘనంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు

కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో సోమవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు కనులపండువగా నిర్వహించారు. శివాజీ చిత్రపటంతో ఉన్న కాషాయ జెండలను చేతబూని ర్యాలీలు నిర్వహించారు. కూడళ్లలోని శివాజీ మహరాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి హైందవ ధర్మ పరిరక్షణకు... స్వరాజ్య స్థాపన కోసం ఆయన చూపిన పోరాట పటిమను గుర్తు చేసుకున్నారు. ఆయన చూపిన తెగువ, పోరాటాలను పలువురు కొనియాడారు.

– కుత్బుల్లాపూర్



రంగారెడ్డి నగర్‌లో శివాజీ జయంతి వేడుకలు



సంజయ్‌గాంధీనగర్‌లో కత్తుల దుర్గయ్య ఆధ్వర్యంలో..



మహదేవపురంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజావాణిలో 12 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న సమస్యలను ప్రజలు సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉపకమిషనర్లు మల్లయ్య, నర్సింహులు అధ్యక్షతన కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 12 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని వారం రోజుల్లో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సుభాష్ నగర్ ప్రాంతంలో ఇంటి నిర్మాణం కోసం అనుమతులు తీసుకొని గోదాం ఏర్పాటు చేసుకున్నారని గత ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పట్టించుకోవడంలేదని స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఇదే తరహాలో ఫిర్యాదు చేస్తూ ఉంటామని సంక్షేమ సంఘం ప్రతినిధి కృష్ణ పేర్కొన్నారు.



అక్రమ గోదాంపై ఉపకమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న సంక్షేమ సంఘం నాయకులు

కేసీఆర్‌ను కలిసిన సాయికిరణ్‌గౌడ్



కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రావల్‌కోల్ సాయి కిరణ్‌గౌడ్ సోమవారం తన జన్మదినాన్ని పురస్కరించుకుని మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి ఆయన ఆశీర్వచనాలు తీసుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోకవర్గంలో పార్టీ బలోపేతంపై దృష్టి సారించి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కేసీఆర్ సూచించినట్లు సాయికిరణ్ తెలిపారు.

నాలా పూడికతీత పనులు చేపట్టాలి

కుత్బుల్లాపూర్: నాలా పూడికతీత పనులు చేపట్టాలని సోమవారం మాజీ కార్పొరేటర్ గౌరీష్‌కు వెంకటేశ్వరనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి వేసవిలో ఇక్కడ నాలాలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం కార్పొరేటర్ పారిజాతకు, మాజీ కార్పొరేటర్ గౌరీష్‌కు వినతి పత్రం అందజేసి వెంటనే పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభించే దిశగా అడుగులు వేస్తామని వారికి హామీ ఇచ్చారు.



మాజీ కార్పొరేటర్ గౌరీష్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

పోచమ్మ పెద్దమ్మ అన్నసంతార్పణ

జీడిమెట్ల: ఎస్ఆర్ నాయక్‌నగర్ పోచమ్మ పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అన్న సంతార్పణ నిర్వహించారు. సుమారు 5వేల మంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం కాలనీలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవంలో కాంగ్రెస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సురేష్‌రెడ్డి, ఎంఎస్‌వాసు, జీడిమెట్ల సీఐ శ్రీనివాసరావు, ఎస్సై హరీష్, కాలనీ అధ్యక్షుడు టీటీకే శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మహేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు డా.గోపాల్‌రెడ్డి, బొబ్బాప్రసాద్, రంగారావు, చారి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న కాలనీవాసులు



ఆలయ ముఖద్వారానికి భూమిపూజ

నిజాంపేట్: నిజాంపేట్‌లోని శ్రీనల్లపోచమ్మ, ఉమామహేశ్వర ఆలయ ముఖద్వార శంకుస్థాపన కార్యక్రమం సోమవారం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కమిటీ సభ్యులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పితాని శ్రీనివాసరావు, ఆలయ పూజారి శ్రీకాంత్‌చారి, నర్మదా, అర్జున, లక్ష్మణ్, దశరథ కుమార్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, భిక్షపతి, రామ్‌చంద్ర నాయక్, కొదమగుండ్ల అమృతయ్(సన్నీ), రమణ, సరిత, లక్ష్మి తదితరులు పాలొన్నారు.



భూమిపూజ చేస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

ఆధార్ అనుసంధానం తప్పనిసరి!

కేవైసీ అప్‌డేట్ కోసం జనం బారులు



షాపూర్ నగర్ రైతుబజార్ మీసేవ వద్ద జనం

జగద్గిరిగుట్ట: ఈనెల ఆఖరు వరకు రేషన్ దుకాణాల్లో కేవైసీ (వేలి ముద్ర) గడువు ముగియనున్న నేపథ్యంలో 'మీ సేవా' సెంటర్ల వద్ద జనం బారులు తీరుతున్నారు. ఇంకా పది రోజులే ఉండటంతో అన్ని సెంటర్లలో కేవైసీ ఆప్‌డేట్ చేయించుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు సర్వర్ కూడా ఇబ్బంది పెట్టడం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. ప్రతీ సెంటర్‌లో రోజుకు 60 టోకన్లు జారీ చేస్తూ అప్‌డేషన్ పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు గడుపు పొడగించిన ప్రభుత్వం ఈసారి పొడగిస్తుందా లేక ఇదే చివరి అవకాశమా..? అనేది వేచి చూడాలి.

మేడ్చల్ డీటీఓగా రఘునందన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: మేడ్చల్ డీటీఓగా రఘునందన్‌గౌడ్ పేట్‌బషీరాబాద్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు రఘునందర్‌గౌడ్ మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను కలిసి మొక్కను అందజేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డీటీఓ కిషన్ బదిలీపై మెహిదీపట్నం వెళ్లారు.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న మేడ్చల్ డీటీఓ

ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఎప్పటి ఫిర్యాదులను అప్పుడే పరిష్కరిస్తే పని సులభమవుతుందని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 184 అర్జీలను కలెక్టర్‌తో సహా సంబంధిత జిల్లా అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: కొంపల్లి-5 శ్రీచైతన్య పాఠశాల వార్షికోత్సవం సోమవారం మేడ్చల్ అత్వేల్లిలోని అనసూయ గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కొంపల్లి జోన్ ఏజీఎం రమణారావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో కో.ఆర్డినేటర్ రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గొర్లు, మేకలను అపహరిస్తున్న ముఠా అరెస్టు

దుండిగల్: గొర్రెలు, మేకలను అపహరించి వాటిని విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా చిలేపల్లి తాండాకు చెందిన రాథోడ్ రాజు(45), రాథోడ్ సీతారామ్(26), బానోత్ శివాజీ(51), రాథోడ్ రాజేష్(50), రాములు బంధువులు. వీరంతా మద్యం పార్టీలు చేసుకుంటూ జల్సాలకు అలవాటు పడ్డారు. రాథోడ్ రాజు గతంలో శంకర్‌పల్లి పీఎస్ పరిధిలో రెండు నేరాలకు పాల్పడిన ఘటనలో జైలుకు వెళ్లి విడుదలయ్యాడు. మద్యానికి బానిసైన రాజు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో పథకం పన్నాడు. దీనికి మిగతా నలుగురు తోడయ్యారు.

◆ వీరంతా ఖాళీ ప్రదేశాల్లో మేతకు వదలిని గొర్రెలు, మేకలను ఎత్తుకెళ్లి వాటిని విక్రయిస్తూ జల్సాలు చేయసాగారు. రాథోడ్ సీతారామ్‌కు తుపాన్ వాహనం ఉంది. దాంట్లోనే దొంగిలించిన గొర్రెలు, మేకలను బీదర్ సమీపంలోని కానాపూర్ గ్రామానికి తరలించి అక్కడ మార్కెట్‌లో విక్రయించేశారు. ఇలా జిన్నారం పీఎస్ పరిదిలో నాలుగు వరకు దొంగతనాలకు పాల్పడ్డారు. దుండిగల్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నెల 18 రాత్రి 7 గంటల ప్రాంతంలో బౌరంపేట్‌లోని సర్వీసు రోడ్డు గుండా వెళ్తున్న తూపాన్ గొర్రెలను తరలిస్తుండగా పట్టుకున్నారు.

◆ వారి వద్ద నుంచి గొర్రెలను విక్రయించగా వచ్చిన రూ.4,5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కాగా నిందితుల్లో రాము పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్లు నర్సింహ, సంజయ్‌రెడ్డి, ఈశ్వర్ లను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.